1St Year Happy Work Anniversary.

షణ్ముఖ

RNI : APTEL / 2023 / 89152

SHANMUKHAVELUGU

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

Good for Health — Best for Readers — THE POWER OF RK PEN

సంపుటి : 03 సంచిక : 108 — గురువారం 23 ఏప్రిల్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.


## అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ పొడిగింపు: ట్రంప్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 22)

ఇరాన్‌తో రెండోవిడత చర్చలపై సందిగ్ధత కొనసాగుతుండగానే... అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇరుదేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ప్రకటించారు . పాకిస్థాన్ అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. అమెరికా- ఇరాన్ మధ్య ఈనెల 8న రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఈ కాల్పుల విరమణ ముగియడానికి కొన్ని గంటల ముందు దీన్ని పొడిగిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సంఘర్షణ ముగించేందుకు ఇరాన్ ఒక ప్రతిపాదనతో ముందుకు వచ్చేవరకు దానిపై దాడులు చేయమన్నారు. అయితే, హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ నౌకల రాకపోకలపై దిగ్బంధనం మాత్రం కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఇరాన్‌లోని అంతర్గత కలహాలే తదుపరి చర్చలు విఫలమవడానికి కారణమని ఈసందర్భంగా ట్రంప్ ఆరోపించారు. ఇక, తమ అభ్యర్థన మేరకు కాల్పుల విరమణను పొడిగించినందుకు ట్రంప్‌నకు పాక్ ప్రధాని షరీఫ్ కృతజ్ఞతలు తెలిపారు. కొనసాగుతోన్న దౌత్య ప్రయత్నాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఇది వీలు కల్పిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

**ఇరాన్ హర్మూజ్‌ను తెరవాలనుకుంటోంది: ట్రంప్**

హర్మూజ్ జలసంధిని ఇరాన్ తెరవాలనుకుంటుందని ట్రంప్ తెలిపారు. దీంతో ఆ దేశం రోజుకు 500 మిలియన్ డాలర్లు సంపాదించుకోగలుగుతుందన్నారు. ▶మిగతా 2లో

## ఉగ్రవాదానికి భారత్ తలొగ్గదు



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 22)

జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్ర దాడి జరిగి నేటికి ఏడాదైంది. ఈ నేపథ్యంలో దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రధాని మోదీ నివాళులర్పించారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ.. 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. పహల్గామ్‌లో ఉగ్ర దాడి దేశం మొత్తాన్ని కలచివేసిందని మోదీ అన్నారు. ఈ విషాదాన్ని, ఇందులో మరణించిన అమాయకులను ఎప్పటికీ మరచిపోలేమన్నారు. వారిని స్మరించుకుంటున్నట్లు తెలిపారు. ఆ దాడిలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు ప్రధాని సానుభూతి వ్యక్తం చేశారు. దుఃఖంలో, సంకల్పంలోనూ దేశం మొత్తం ఐక్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు. ▶మిగతా 2లో

## బెంగాల్‌లో ఏటా లక్ష ఉద్యోగాలిస్తాం

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 22)

పశ్చిమ బెంగాల్‌ను చొరబాటుదారులు లేని రాష్ట్రంగా మార్చేందుకు ఈ ఎన్నికలు ప్రజలకు లభించిన ఓ అవకాశమని, తాము అధికారంలోకి వస్తే ప్రతిభ ఆధారంగా ఏటా యువతకు లక్ష



ఉద్యోగాలిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. శాల్‌బనీ, పశ్చిమ బర్ధమాన్‌లోని కుల్టీల్లో మంగళవారం జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన ప్రసంగించారు. 'ఒకప్పుడు ఇనుప ఖనిజ ఉత్పత్తికి కేంద్రంగా కుల్టీ ఉండేది. కానీ మమతా బెనర్జీ ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేశారు. మేం అధికారంలోకి వస్తే కుల్టీకి పూర్వ వైభవాన్ని తీసుకొస్తాం. అక్రమ మైనింగ్‌ను అరికట్టి ఈ ప్రాంతంలో కాలుష్యాన్ని సృష్టిస్తున్న స్పాంజ్ ఐరన్ ఉత్పత్తిపై నిషేధం విధిస్తాం. బెంగాల్‌లో కొత్తగా పుట్టుకొస్తున్న సిండికేట్, ▶మిగతా 2లో

# అనకాపల్లిలో రూ.5,400 కోట్ల రీన్యూ సోలార్ ప్లాంట్...



- నేడు శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు
- అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రీన్యూ భారీ సోలార్ ప్లాంట్
- రూ. 5,400 కోట్ల పెట్టుబడితో ఇంగోట్-వేఫర్ తయారీ కేంద్రం
- ఈ ప్రాజెక్టు ద్వారా 2,100 మందికి పైగా ఉపాధి అవకాశాలు
- ఏపీలో మొత్తం రూ. 82,000 కోట్ల పెట్టుబడుల దిశగా రీన్యూ సంస్థ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 22)

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో మరో భారీ పెట్టుబడికి రంగం సిద్ధమైంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో సుమారు రూ. 5,400 కోట్ల వ్యయంతో సోలార్ ఇంగోట్-వేఫర్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రముఖ పునరుత్పాదక ఇంధన సంస్థ రీన్యూ ఎనర్జీ గ్లోబల్ (=వచీవఃు) ముందుకొచ్చింది. ఈ మెగా ప్రాజెక్టుకు ఏప్రిల్ 23న ముఖ్యమంత్రి చంద్రబాబు, రీన్యూ సీఈఓ సుమంత్ సిన్హాతో కలిసి శంకుస్థాపన చేయనున్నారు.ఈ ప్రాజెక్టులో భాగంగా రూ. 4,200 కోట్లతో 6 గిగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ఇంగోట్-వేఫర్ తయారీ ప్లాంట్‌ను, మరో రూ. 1,200 కోట్లతో 125 మెగావాట్ల హైబ్రిడ్ క్యాప్టివ్ పవర్ ప్లాంట్‌ను రీన్యూ నిర్మించనుంది. కేవలం 24 నెలల రికార్డు సమయంలోనే ఈ ప్లాంట్‌లో కార్యకలాపాలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 2,100 మందికి పైగా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. సోలార్ పీవీ మాడ్యూల్స్, సెల్స్ తయారీకి అత్యంత కీలకమైన ఇంగోట్స్, వేఫర్లను దేశీయంగా ఉత్పత్తి చేయడం ద్వారా సోలార్ సరఫరా రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు ఈ ప్లాంట్ దోహదపడనుంది. 2015 నుంచి రాష్ట్రంలో ▶మిగతా 2లో

## మోదీ ఉగ్రవాది: ఖర్గే

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 22)

ప్రధాని మోదీ ఒక ఉగ్రవాది అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో విపక్షనేత మల్లికార్జున ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇవి దేశవ్యాప్తంగా దుమారం రేపాయి. ఆయన క్షమాపణ చెప్పాలంటూ భాజపా డిమాండ్ చేయగా తన వ్యాఖ్యల్లోని ఉద్దేశంపై ఖర్గే వివరణ ఇచ్చారు. మంగళవారం చెన్నైలో



ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ అన్నాడీఎంకే-భాజపా పొత్తును తీవ్రస్థాయిలో విమర్శించారు. 'అన్నాదురై ఫొటో పెట్టుకునే అన్నాడీఎంకే నేతలు మోదీతో ఎలా చేతులు కలపగలరు? ఆయనొక టెర్రరిస్టు. సమానత్వంపై ఆయనకు నమ్మకం లేదు. సమానత్వం, న్యాయం అంటే ఆయనగారి పార్టీకి కూడా విశ్వాసం లేదు. అలాంటివారితో వీరు (అన్నాడీఎంకే) కలవడమంటే వారంతా ▶మిగతా 2లో

## మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు కన్నుమూత



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 22)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర రావు(90) కన్నుమూశారు. గత నెల రోజులుగా హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఇవాళ తుది శ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల పలువురు నేతలు సంతాపం ప్రకటించారు. గురువారం ఆయన అంత్యక్రియలు పంజాగుట్ట శ్మశానవాటికలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 1978లో కాంగ్రెస్ నుంచి ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1984లో నెల రోజులపాటు ▶మిగతా 2లో

## ఉద్యోగుల పాలిట నరరూప రాక్షసుడు జగన్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 22)

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినందుకు వెంకట్రామిరెడ్డి జగన్ ప్రభుత్వంలోనే సస్పెండ్ అయ్యారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు మీరు తప్పు చేశారంటూ జగన్ రెడ్డి




మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు.

జగన్ నిజం ఒప్పుకుంటున్నాడని, ఎందుకంటే ఆయన చేసిన తప్పులకు జైల్లో పెట్టకుండా చంద్రబాబు తప్పు చేశారని చురక అంటించారు. చంద్రబాబు ఆ తప్పు చేయడం వల్లే జగన్ ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024 ఏప్రిల్ 2న ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా కాండక్ట్ రూల్స్ ను బ్రేక్ చేసి కాకర్ల వెంకట్రామిరెడ్డి, చల్లా చంద్రయ్యలు వైసీపీ జెండాలు పట్టుకొని కడప జిల్లాలోని నాలుగు ఆర్టీసీ డిపోల్లో వైసీపీకి అనుకూలంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారని ఆరోపించారు.అవినీతి, పనిపట్ల నిబద్ధత లేకపోవడం, పనిచేయకపోవడం వంటి వాటికి కాండక్ట్ రూల్స్ ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు. 2024 ఏప్రిల్ 2న బద్వేల్ రిటర్నింగ్ అధికారి కలెక్టర్ కు రిపోర్ట్ పెట్టారని, దీనితో అదే రోజున 137/2024, 81/2024, 116/2024, 166/2024 నాలుగు ఎఫ్ఐఆర్‌లు కాకర్ల వెంకట్రామిరెడ్డి, చల్లా చంద్రయ్యలపై నమోదయ్యాయని గుర్తు చేశారు. బద్వేల్, మైదుకూరు, ప్రొద్దుటూరు, కడప డిపోల్లో వైసీపీ ▶మిగతా 2లో



## నాదెండ్ల భాస్కరరావు మరణం రాష్ట్రానికి తీరని లోటు: జగన్

**నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల సంతాపం తెలిపిన జగన్**

**ఏపీ రాజకీయాల్లో నాదెండ్లది విశిష్ట స్థానమని కితాబు**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 22)

ఆయన రాజకీయ అనుభవం తరతరాలకు ఆదర్శమని వ్యాఖ్య

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు ఈ రోజు కన్నుమూసిన సంగతి తెలిసిందే. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్ లోని కాంటినెంటల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన మృతి పట్ల రాజకీయ ప్రముఖులు సంతాపం ▶మిగతా 2లో

## పోలవరంపై సందేహాలకు తెర.. పూర్తి ఎత్తుతోనే నిర్మాణం

- ▶పోలవరం ప్రాజెక్టు ఎత్తుపై నెలకొన్న సందేహాలకు తెర
- ▶గరిష్ఠ ఎత్తు 45.72 మీటర్లుగా పీపీఏ అధికారిక ప్రకటన
- ▶కేంద్ర జలశక్తి కార్యదర్శి పర్యటన తర్వాత మారిన చిత్రం
- ▶వచ్చే ఏడాది జూన్ నాటికి తొలి దశ పనులు పూర్తికి లక్ష్యం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 22)



బహుళార్థ సాధక పోలవరం ప్రాజెక్టు ఎత్తు విషయంలో నెలకొన్న సందేహాలకు తెరపడింది. ప్రాజెక్టును దాని పూర్తిస్థాయి ఎత్తయిన 45.72 మీటర్ల వద్దే నిర్మించనున్నట్లు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) అధికారికంగా స్పష్టం చేసింది. దీంతో ప్రాజెక్టులో 194.60 టీఎంసీల నీటిని నిల్వ చేసేందుకు మార్గం సుగమమైంది. పీపీఏ తన అధికారిక వెబ్‌సైట్‌లో ఈ వివరాలను పొందుపరచడంతో ప్రాజెక్టు భవిష్యత్తుపై స్పష్టత వచ్చింది.ఇటీవల కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు ప్రాజెక్టును సందర్శించిన తర్వాత ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయన పర్యటనకు ముందు, ప్రాజెక్టును తొలి దశలో 41.15 మీటర్లకే పరిమితం చేస్తారన్న సమాచారం పీపీఏ వెబ్‌సైట్‌లో ఉండేది. అయితే, కాంతారావు పర్యటన అనంతరం ఆ వివరాలను సవరించి, ▶మిగతా 2లో

మొదటిపేజీ తరువాయి

# అనకాపల్లిలో రూ.5,400 కోట్ల రీన్యూ సోలార్ ప్లాంట్...

కార్యకలాపాలు సాగిస్తున్న రీన్యూ, ఇప్పటికే అనంతపురం జిల్లాలో రూ. 22,000 కోట్లతో దేశంలోనే అతిపెద్ద హైబ్రిడ్ రెన్యూవబుల్ ఎనర్జీ కాంప్లెక్స్‌ను నిర్మిస్తోంది. తాజా ప్రాజెక్టుతో కలిపి రాష్ట్రంలో మొత్తం రూ. 82,000 కోట్ల పెట్టుబడుల దిశగా రీన్యూ అడుగులు వేస్తోంది. ఈ ప్రాజెక్టుతో అనకాపల్లి పారిశ్రామిక ముఖచిత్రం మారనుందని నిపుణులు భావిస్తున్నారు.

## అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ పొడిగింపు: ట్రంప్

దాన్ని మూసి ఉంచితే.. ఆ మొత్తాన్ని అది కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఇరాన్ నౌకలను మేం దిగ్బంధించినందుకే హర్మూజ్‌ను మూసేశామని చెప్పడం వారి పరువు కాపాడుకోవడానికేనన్నారు. నాలుగు రోజుల క్రితం కొందరు తన దగ్గరకు వచ్చి 'సర్ ఇరాన్ వెంటనే జలసంధిని తెరవాలనుకుంటుంది' అని చెప్పారన్నారు. అయితే, దిగ్బంధనం ఎత్తేస్తే.. ఇరాన్ ఎప్పటికీ తమతో ఒక ఒప్పందానికి రాదని, ఆ దేశంలోని మిగిలిన భాగాన్ని పేల్చేసి, వారి లీడర్లను లక్ష్యంగా చేసుకుంటేనే అది ఒప్పందానికి వస్తుందని ట్రంప్ హెచ్చరించారు.

## ఉగ్రవాదానికి భారత్ తలొగ్గదు: ప్రధాని మోదీ

ఈ సందర్భంగా ఉగ్రవాదానికి భారత్ ఎప్పటికీ తలొగ్గదని స్పష్టంచేశారు. ఉగ్రవాదుల కుట్రలు ఎప్పటికీ సఫలం కావన్నారు. కాగా.. గతేడాది ఏప్రిల్ 22న పర్యాటకులపై ముష్కరులు విచక్షణారహితంగా దాడి చేశారు. హిందువులే లక్ష్యంగా జరిగిన ఈ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిని ప్రపంచమంతా తీవ్రంగా ఖండించింది. అనంతరం భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టి పాకిస్థాన్‌లోని ఉగ్రమూకల క్యాంపులను నేలమట్టం చేసింది.

## బెంగాల్‌లో ఏటా లక్ష ఉద్యోగాలిస్తాం: అమిత్ షా హామీ

మాఫియా, గూండా రాజ్యానికి ముగింపు పలుకుతాం. ఓ నిర్దిష్ట వర్గానికి చెందినవారు ఒకేసారి 4 పెళ్లిళ్లు చేసుకోకుండా అరికట్టేందుకు రాష్ట్రంలో ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తాం. మేం రామ మందిరం నిర్మిస్తే.. మమత సన్నిహితుడు హుమాయూన్ కబీర్.. బాబ్రీ మసీదు కట్టేందుకు యత్నిస్తున్నారు. భారత్‌లో అంతర్భాగమైన బెంగాల్‌లో బాబ్రీ మసీదును నిర్మించాలని ఎవరనుకున్నా సహించేది లేదు' అని అమిత్ షా హెచ్చరించారు. దశాబ్దాలుగా ఉన్న గూర్ఖా సమస్యను ఆరు నెలల్లోగా పరిష్కరిస్తామని దార్జిలింగ్‌లోని కుర్సియాంగ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన హామీ ఇచ్చారు.

## మోదీ ఉగ్రవాది: ఖర్గే

ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నట్లే' అని ఖర్గే అన్నారు. మోదీని ఏ సందర్భంగా ఉగ్రవాది అంటున్నారని విలేకరులు ప్రశ్నించారు. దాంతో ఆయన సర్దుకుంటూ.. మోదీ మన దేశ ప్రజాస్వామ్య స్వరూపాన్ని టెర్రరైజ్ (భయభ్రాంతుల్ని) చేస్తున్నారని చెప్పడమే తన ఉద్దేశమని వివరించారు.

**జేబు సంస్థగా ఈసీ**

"ఇక్కడ టెర్రరిస్ట్ అంటే ఉగ్రవాది అని యథాతథ అర్థం తీసుకోవద్దు. నేనెన్నడూ అలా అనలేదు. ప్రధాని తన అధికారాన్ని, ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తూ విపక్షాలపై బురద జల్లుతున్నారు. ఎన్నికల జాబితాల్లో అవకతవకలు.. ఆయన చేస్తున్న అధికార దుర్వినియోగానికి ఒక నిదర్శనం. సీఈసీని తన జేబులో పెట్టుకున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఆయన అతిక్రమించినా దానిని పట్టించుకోకుండా భాజపా కార్యాలయంగా ఈసీ వ్యవహరిస్తోంది. మహిళా రిజర్వేషన్ల బిల్లును ప్రతిపక్షాలు ఓడించినట్లు మోదీ తప్పుడు ప్రచారం చేస్తున్నారు" అని ఖర్గే ఆరోపించారు.

**కాంగ్రెస్ అర్బన్ నక్సల్ పార్టీ: భాజపా**

ఖర్గే వ్యాఖ్యలపై భాజపా భగ్గుమంది. ఇవి దేశప్రజల్ని అవమానించడమేనని భాజపా అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. కాంగ్రెస్సే 'అర్బన్ నక్సల్ పార్టీ' అని, అందుకే ప్రధానిపై ఖర్గే ఇలాంటి నిందాపూర్వక భాష వాడారని, ప్రధాని అంతుచూస్తామని మాట్లాడటం సహా ఇలా విషం చిమ్మడం వెనుక దేశవ్యతిరేక శక్తులు ఉన్నాయని భాజపా అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ చెప్పారు. ఖర్గే వ్యాఖ్యలు సిగ్గుచేటు అని, ఆ పార్టీ క్షమాపణలు చెప్పాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ డిమాండ్ చేశారు. ఇలాంటి వ్యాఖ్యలతో ఎన్నికల ఫలితాన్ని మార్చలేరని స్పష్టంచేశారు. ప్రజావర్తనలో అన్ని ప్రమాణాలను ఖర్గే అతిక్రమించారని, అవమానకరంగా మాట్లాడారని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ధ్వజమెత్తారు.

**ఖర్గేపై చర్యలకు ఈసీకి వినతి**

దిల్లీ: ప్రధానిని ఉగ్రవాదిగా అభివర్ణించినందుకు ఖర్గేపై చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని భాజపా కోరింది. ఆయన వ్యాఖ్యల్ని వెంటనే పరిగణనలో తీసుకుని, బహిరంగ క్షమాపణలు చెప్పేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది.

## ఉద్యోగుల పాలిట నరరూప రాక్షసుడు జగన్

యూనియన్ నాయకుడు చల్లా చంద్రయ్యతో కలిసి వెంకట్రామిరెడ్డి వీసీకి అనుకూలంగా జెండాలు పట్టుకొని ప్రచారం చేశాడు కాబట్టే నాలుగు చోట్ల ఎఫ్ఐఆర్ నమోదు అయిందని అన్నారు. 2024 ఏప్రిల్ 2న ఏపీలో జగన్ ప్రభుత్వమే అధికారంలో ఉందని అన్నారు. సచివాలయ ఉద్యోగిగా ఉండి ప్రచారం చేసినందుకు బద్వేల్ రిటర్నింగ్ అధికారి ఫిర్యాదు చేశారనే విషయాన్ని జగన్ తెలుసుకోవాలని హితవు పలికారు. జీఓ 464లో ఈ వివరాలు అన్ని ఉన్నాయని తెలిపారు. ఎన్నికల సమయంలో వారు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని కడప కలెక్టర్ నివేదిక ఇస్తే, దాని ఆధారంగా తమ ప్రభుత్వం విచారణ జరిపిందని అన్నారు. 2024 ఏప్రిల్ 18న నివేదిక ఇస్తే జగన్ ప్రభుత్వం ఉన్నప్పుడే వెంకట్రామిరెడ్డిని పంచాయితీ రాజ్ సెక్రటరీ సస్పెండ్ చేశారని తెలిపారు. అప్పుడే ఆర్టీసీ ఉద్యోగి చల్లా చంద్రయ్యను కూడా సస్పెండ్ చేశారని వెల్లడించారు. ఆ సమయంలో అధికారంలో ఉన్నది కూడా జగన్ రెడ్డే అన్నారు. తప్పు చేశారు కాబట్టే జగన్ ప్రభుత్వంలోనే వెంకట్రామిరెడ్డిపై చర్యలు ప్రారంభమయ్యాయని అన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక ఆగస్టులో విచారణ ప్రారంభించామని అన్నారు. ఏ కారణాలతో సస్పెండ్ చేశారో తెలుసుకునేందుకు విచారణ జరిపామని అన్నారు. విచారణలో తప్పు చేశాడని తెలియడంతో డిస్మిస్ చేశామని అన్నారు.

ఒక సెక్షన్ అధికారిని సస్పెండ్ చేస్తే చంద్రబాబు "నువ్వు తప్పు చేస్తున్నావ్" అని జగన్ అనడమేమిటని ప్రశ్నించారు. వెనకేసుకు రావడానికి మీకు వెంకట్రామిరెడ్డి ఒక్కడే రాష్ట్ర ఉద్యోగియా అని నిలదీశారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రామకృష్ణను సస్పెండ్ చేసి జైల్లో పెట్టారని, ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో చాలామందిని సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. ఏబీ వేంకటేశ్వరరావు, ఎల్వీ సుబ్రహ్మణంను ఇబ్బందులకు గురి చేశారని అన్నారు. మాస్క్ అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్ ను వేధించి చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించిన పాపానికి దళిత కానిస్టేబుల్ ను వేధించారని, ఇవన్నీ తమ హయంలో జరగలేదని, జగన్ పాలనలో జరిగాయని ధ్వజమెత్తారు. వెంకట్రామిరెడ్డిని డిస్మిస్ చేస్తే అంతా అధర్మం జరిగినట్లు జగన్ మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దళితుడిని హత్య చేసి డోర్ డెలివరీ చేసినవారిని పక్కన పెట్టుకున్నారని జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ఇలాంటి రాజకీయాలు ఎప్పుడూ చేయలేదు.. చేయబోరని అన్నారు. తనపై సీఐడీ కేసు పెట్టి వేధించారని తెలిపారు. గచ్చిబౌలిలోని సెక్రటరియర్ హౌసింగ్ కాలనీలో డైరెక్టర్ గా మారి అప్పుడు ఉన్న వ్యక్తిని దించేసి ప్రెసిడెంట్ అయిన వ్యక్తి వెంకట్రామిరెడ్డి అని ఆరోపించారు. ఖాళీ స్థలాలను ప్లాట్లుగా ఇచ్చేసి ప్రజల స్థలాన్ని అమ్ముకున్నారని అన్నారు. విచారణ చేస్తే మొత్తం సోసైటీని రద్దు చేసే పరిస్థితిని తీసుకొచ్చిన వ్యక్తి వెంకట్రామిరెడ్డి అని ధ్వజమెత్తారు. ఆయన జగన్ హస్తంతోనే సచివాలయ ప్రెసిడెంట్ అయ్యాడని ఆరోపించారు. ఉద్యోగులకు ఆయన చేసిన మంచి కూడా ఏదీ లేదని అన్నారు. ఉద్యోగులను బెదరించి బయపెట్టడం వెంకట్రామిరెడ్డి చేసిన పనే అని ఆరోపించారు. వేల మంది ఉద్యోగులు కరోనా సమయంలో నష్టపోయారు, చనిపోయారు, కానీ ఆయన ఒక్కరికైనా సాయం చేశారా అని నిలదీశారు. ఉద్యోగుల గురించి మాట్లాడే అర్హత జగన్ కు లేదని అశోక్ బాబు అన్నారు. ఉద్యోగుల పాలిట నరకాసురుడు జగన్ అని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 50 ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు ఉన్నాయని, కనీసం ఒక్క సంఘమైనా ఉద్యోగులకు జగన్ మంచి చేశాడని చెబుతారా అని ప్రశ్నించారు. వెంకట్రామిరెడ్డి భార్యకు ముషీరాబాద్ వైసీపీ టికెట్ అడిగారని, వెంకట్రామిరెడ్డి జగన్ కు దగ్గరి బంధువు కూడా అన్నారు. కాండాక్ట్ రూల్స్ లో ఏ ప్రభుత్వ ఉద్యోగి కూడా ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించకూడదని పేర్కొన్నారు. ఉద్యోగులకు ఉన్న రూల్స్‌ను వెంకట్రామిరెడ్డి బ్రేక్ చేసినందువల్లే డిస్మిస్ అయ్యాడని అన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు రూ.30 వేల కోట్లు బాకీలు పెట్టిన వ్యక్తి జగన్ అని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే రూ.22,000 వేల కోట్లు చెల్లించామని, సీపీఎస్ అప్ గ్రేడ్ చేయడంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందని అన్నారు. చంద్రబాబు ప్రజాస్వామ్యబద్ధంగా పాలన సాగిస్తున్నారని అన్నారు. పేపర్, టీవీ ఉందని ఏది పడితే అది మాట్లాడితే జనం అంగీకరించరని అన్నారు. మీ ప్రభుత్వంలోనే వెంకట్రామిరెడ్డి సస్పెండ్ అయ్యారనే విషయం గుర్తించాలని హితవు పలికారు. వెకంట్రామిరెడ్డి జగన్ కంటే ఎక్కువ అరాచకాలు చేశాడని వ్యాఖ్యానించారు. వెంకట్రామిరెడ్డి డిస్మిస్ ఏ సందర్భంలో జరిగిందో వివరణ ఇచ్చేందుకు సిద్ధమని అన్నారు. వెంకట్రామిరెడ్డి కుటుంబం మొత్తం వైసీపీ కార్యకర్తలేనని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగుల కాండక్ట్ రూల్స్ ప్రకారమే ప్రభుత్వం చర్యలు తీసుకుందని అశోక్ బాబు తెలిపారు.

## మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు కన్నుమూత

ఉమ్మడి ఏపీ సీఎంగా పనిచేశారు. ఎన్టీఆర్, మర్రి చెన్నారెడ్డి, అంజయ్య హయాంలో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. నాదెండ్ల భాస్కర రావు మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు. భాస్కర రావు కుమారుడు, ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను సీఎం ఫోన్‌లో పరామర్శించారు.

**నాదెండ్ల భాస్కరరావు ఆత్మకు శాంతి చేకూరాలి: పవన్ కల్యాణ్**

నాదెండ్ల భాస్కరరావు మృతిపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంతాపం ప్రకటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. నాదెండ్ల భాస్కరరావు 70వ దశకం నుంచి ప్రజా జీవితంలో ఉన్నారని, న్యాయవాదిగా, రాజకీయవేత్తగా ఆయనకున్న పరిజ్ఞానం ఎంతో విలువైనదని అన్నారు. ఆయన కుమారుడు, మంత్రి నాదెండ్ల మనోహర్ పితృవియోగ బాధ నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈమేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

## నాదెండ్ల భాస్కరరావు మరణం రాష్ట్రానికి తీరని లోటు: జగన్

వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ అధినేత జగన్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ... నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. ఏపీ రాజకీయాల్లో నాదెండ్ల భాస్కరరావు విశిష్ట స్థానం సంపాదించారని అన్నారు. ప్రజాసేవలో ఆయన నిబద్ధత, రాజకీయ అనుభవం తరతరాలకు ఆదర్శమని చెప్పారు. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు.

## పోలవరంపై సందేహాలకు తెర.. పూర్తి ఎత్తుతోనే నిర్మాణం

గరిష్ఠ నీటిమట్టం వివరాలను చేర్చారు. ప్రాజెక్టు రెండో దశకు అవసరమైన అటవీ, పర్యావరణ అనుమతులు, భూసేకరణ, పునరావాసం వంటి అంశాలను కేంద్ర ప్రభుత్వమే పర్యవేక్షిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ హామీతో రెండో దశ పనులకు కేంద్రం సిద్ధమవుతోందన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మరోవైపు, ప్రాజెక్టు తొలిదశ పనులను వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తిచేయాలని జల వనరుల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే స్పిల్‌వే నిర్మాణం పూర్తవగా, ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యాం పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రాజెక్టు పూర్తయితే 10.13 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణతో పాటు, కృష్ణా బేసిన్‌కు 80 టీఎంసీల నీటి తరలింపు, తాగునీరు, 960 మెగావాట్ల విద్యుదుత్పత్తి వంటి ప్రయోజనాలు చేకూరనున్నాయి. అయితే, రెండో దశ పనులు ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారనున్నాయి. రెండో దశ కోసం సుమారు 86,000 నిర్వాసిత కుటుంబాలను తరలించాల్సి ఉండగా, భూసేకరణ, పునరావాసానికి రూ.28,561 కోట్లకు పైగా ఖర్చవుతుందని అంచనా.

# పోషణ్ పక్వాడా అవగాహన కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఏప్రిల్ 22)

గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలలో పోషకాహార లోపాన్ని నివారించడం, వారి ఆరోగ్య స్థితిని మెరుగుపరచడం, ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహించడంలో భాగంగా 8వ పోషణ్ పఖ్వాడా అవగాహన పక్షోత్సవంలో భాగంగా చిన్నగంజాం మండలం రామకోటేశ్వర కాలని నందు ఐసిడిసి సూపర్వైజర్ సుమలత అధ్వర్యంలో పోషణ్ పఖ్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సూపర్వైజర్ సుమలత మాట్లాడుతూ పోషణ్ పఖ్వాడా ద్వారా బిడ్డ పుట్టిన మొదటి 1,000 రోజుల పోషణపై ప్రత్యేక దృష్టి పేట్టినట్లు తెలిపారు. పిల్లలకు జంక్‌ఫుడ్ కు దూరంగా వుంచాలని, కాలానుగుణంగా వచ్చే పండ్లు, పాలు, గుడ్లు అందించాలని తెలిపారు. పిల్లలకు ఫోన్ దూరంగా వుంచాలని, ఫోన్ అధికంగా చూడటం వల్ల కంటి సంబంధించిన వ్యాధులు వచ్చే అవకాశం వుంటుందన్నారు. పిల్లలతో ఎక్కవ సమయం గడపటం వల్ల వారి మనో వికాసం మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్త బి తిరుపతమ్మ, సహాయకులు డి నాగమణి, గర్భవతులు పాల్గొన్నారు.

## సిఎస్‌పి షార్ట్ టర్మ్ ఇంటర్నల్ షిప్‌పై డిగ్రీ విద్యార్థులకు అవగాహన




(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 22)

జీవిఎస్ఎం గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఉలవపాడులో చదువుతున్నటువంటి మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థిని, విద్యార్థులకు సీఎస్‌పి, షార్ట్ టర్మ్ ఇంటర్నెట్ షిప్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా సీఎస్‌పి (కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్) చేయడం ద్వారా మొదటి సంవత్సరం విద్యార్థులకు కమ్యూనికేషన్స్ స్కిల్స్‌ని నేర్చుకుంటారన్నారు. షార్ట్ టర్మ్ ఇంటర్న్ షిప్ ద్వారా సైన్స్ విద్యార్థులు మెడికల్ కోడింగ్ సర్టిఫికేట్ కోర్సును ఆర్ట్స్ విద్యార్థులు డిజిటల్ మార్కెటింగ్ కోర్సును, కామర్స్ విద్యార్థులు టాలీ కోర్సును నేర్చుకుని సర్టిఫికెట్లు పొందాలని కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ డి సుజాత విద్యార్థినీ, విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహమ్మదాపురంలో టూల్ కిట్స్ పంపిణీ




(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, ఏప్రిల్ 22)

మండలంలో పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పదవ తరగతి విద్యార్థులు 12 రోజుల పాటు వృత్తి విద్యా ఇంటర్న్ షిప్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇంటర్న్ షిప్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణ, జిల్లా వృత్తి విద్యా పరిశీలకులు కిషోర్ లు సర్టిఫికెట్లు, టీ షర్ట్స్, ఐటి, బిఎస్ఎఫ్ఐ శిక్షణలకు సంబంధించిన టూల్ కిట్స్‌ను అందించడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వృత్తి విద్యా ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. జిల్లా పరిశీలకులు కిషోర్ వృత్తి విద్యలోని నైపుణ్యాలను, ఆధునిక సాంకేతికను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని తెలియజేశారు. వృత్తి విద్యలో విద్యార్థులకు చక్కని శిక్షణను అందించిన వృత్తి విద్యా ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, భారతిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఇండ్ల జాబితా, ఇండ్ల గణన పై శిక్షణ తరగతులు నిర్వహాణ




(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 22)

మండల కేంద్రమైన ఉలవపాడు గవర్నమెంట్ హై స్కూల్ నందు బుధవారం జనగణన 2027 ఫేస్ వన్ లో భాగంగా మూడవ బ్యాచ్‌కి రెండవ రోజు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఫీల్డ్ ట్రైనర్స్ అయిన పున్నేపల్లి శ్రీనివాసులు, షేక్ బాజ్జీ మూడవ బ్యాచ్ కి నియమించబడిన ఎన్యూమరేటర్‌లు, సూపర్వైజర్‌లకు హెచ్ఎల్ఓ యాప్‌లో ఇండ్ల గణన సమయంలో సేకరించే సమాచారానికి సంబంధించిన ప్రశ్నలను, స్వీయ గణన యొక్క అవశ్యకతను వివరించడం జరిగింది. ప్రతి ఒక్కరూ నిర్ణీత సమయంలో గణన పూర్తి చేసి ఖచ్చితమైన గణాంకాలు ప్రభుత్వానికి ఇవ్వవలసినదిగా సెన్సస్‌లో భాగస్వాములం కావడం గర్వంగా భావించాలని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో ఎన్యూమరేటర్‌లు, సూపర్వైజర్‌లు, ఏఎస్ఓ పుష్పలత, విఆర్ఓలు పవన్ కుమార్, పీరయ్య, పెద బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.




షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

23.04.26    గురువారం


## ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 22)
రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కెఎస్ జవహర్‌ను మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత, ఎర్రగొండపాలెం తెదేపా ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనను రాయవరంలోని వెలిగొండ ప్రాజెక్టు గెస్ట్ హౌస్‌లో కలిసి పలు విషయాలను చర్చించారు. జిల్లా ఏర్పడిన తర్వాత పరిస్థితుల పై చైర్మన్‌కు కలెక్టర్ వివరించారు. అనంతరం అక్కడ ఉన్న వెలుగొండ ప్రాజెక్టు నమూనాను ఎస్ఈ అబూతలిం కలెక్టర్‌కు సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో (తరువాయి 4లో...)

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

### మలుపులు, జంక్షన్ల వద్ద కన్వెక్స్ మిర్రర్ల ఏర్పాటు

### రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

### ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలి

### మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు






(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 22)
మార్కాపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయవరం వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం నేపథ్యంలో, రహదారి భద్రతను మెరుగుపరచే దిశగా కుంభాకార దర్పణాలను మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు బుధవారం ఏర్పాటు చేశారు. ప్రమాదాలకు కారణమయ్యే మలుపులు, దృష్టి లోపం ఉన్న ప్రదేశాలలో డ్రైవర్లకు ముందస్తు హెచ్చరిక అందించేందుకు ఈ దర్పణాలు ఉపయోగపడతాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ దర్పణాల స్థితి, ఎత్తు, కోణం వంటి సాంకేతిక అంశాలను సమీక్షించి, అవసరమైన అన్ని ప్రదేశాల్లో వీటిని ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అలాగే ప్రమాదాలు సంభవిస్తున్న మలుపులు, జంక్షన్లు, టి.జంక్షన్,వై జంక్షన్, యు టర్న్, విజిబిలిటీ తక్కువగా ఉన్న ప్రదేశాలను గుర్తించిన ప్రాంతాల్లో అదనంగా హెచ్చరిక బోర్డులు,కుంభాకార దర్పణాలు, ప్రతిబింబించే స్ట్రిప్స్, వేగ పరిమితి సూచనలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇటివల కాలంలో రాయవరం శివారు ప్రాంతంలో బస్సు యాక్సిడెంట్ జరిగిన ప్రదేశాలో కుంభాకార దర్పణాలు అమర్చి ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రహదారి భద్రత ప్రతి పౌరుడి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యాలు పెద్ద ప్రమాదాలకు దారి తీస్తాయని, కుంభాకార దర్పణాల ఏర్పాటు వల్ల వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలను ముందుగానే గమనించి వేగాన్ని నియంత్రించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. (తరువాయి 4లో...)

## "బడి పిలుస్తోంది" ఎన్రోల్మెంట్ డ్రైవ్ స్పెషల్ సాంగ్‌ను విడుదల చేసిన ప్రకాశం జిల్లా డీఈవో రేణుక



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 22)
పాఠశాల విద్యాశాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వినూత్నంగా చేపట్టిన 'బడి పిలుస్తోంది' విద్యార్థుల ఎన్రోల్మెంట్ డ్రైవ్‌లో భాగంగా పొదిలి మండల ఉపాధ్యాయుడు ఎస్ కామేశ్వరరావు, రచించిన "బడి పిలుస్తోంది" ఎన్రోల్మెంట్ డ్రైవ్ స్పెషల్ సాంగ్‌ను ప్రకాశం జిల్లా డీఈవో సివి రేణుక విడుదల చేశారు. 'బడి పిలుస్తోంది' పాట ప్రభుత్వ బడుల ప్రత్యేకతను, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులకు బడి పట్ల ఒక సద్భావమును కలిగించి తమ పిల్లలను బడిలో చేర్పించే విధంగా ఉందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి,వారి బంగారు భవితకు బాటలు వేయాలన్నారు. సమాజ శ్రేయస్సుకు దోహదపడే ఇంకా అనేక పాటలు రాయాలని గీత రచయిత, పొదిలి మండల ఉపాధ్యాయుడు ఎస్ కామేశ్వరరావును ప్రశంసించి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బంగారు బాల్యం జిల్లా నోడల్ ఆఫీసర్ వి గిరిధర శర్మ పాల్గొన్నారు.



## నిషేధిత 22(ఏ) భూములకు సంబంధించిన పత్రాల పరిశీలన

### నివేదిక రూపకల్పన ప్రక్రియలో ఏకరూపత ఉండాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 22)
నిషేధిత 22(ఏ) భూములకు సంబంధించిన పత్రాల పరిశీలన, నివేదిక రూపకల్పన ప్రక్రియలో ఏకరూపత ఉండాలని జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి చెప్పారు. వీటికి సంబంధించిన పత్రాలను బుధవారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో ఆమె సమక్షంలో అధికారులు పరిశీలించారు. ఈ ప్రక్రియ కోసం ఇప్పటికే ప్రత్యేక బృందాలను కలెక్టర్ నియమించారు. ఈ భూములకు సంబంధించిన పత్రాలను తొలుత తహసిల్దార్, ఆర్డిఓ పరిశీలించిన అనంతరం, కలెక్టరేట్ పరిపాలన విభాగంలోని వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్ల నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు పరిశీలించాల్సి ఉంటుంది. అనంతరం ఇవి డిఆర్ఓ, జాయింట్ కలెక్టర్ పరిశీలిస్తారు. ఈ పరిశీలన ప్రక్రియలో ఏకరూపత కోసం బుధవారం ప్రత్యేకంగా ఈ పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టారు. అధికారులకు, సిబ్బందికి వివిధ అంశాలపై జాయింట్ కలెక్టర్ అవగాహన కల్పించారు. అదేవిధంగా మే, జూన్ నెలల్లో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి ప్రణాళిక, ఈ - కేవైసీ, రీ సర్వే పైనా జాయింట్ కలెక్టర్ ఈ సందర్భంగా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ బి చిన ఓబులేసు, కందుకూరు సబ్ కలెక్టర్ డి.హిమవంశీ, ఆర్డీవోలు, తహసిల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.


## కలెక్టర్‌ను విజయ సునీతను కలిసిన జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పి హర్షవర్ధన్ రాజు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 22)
మార్కాపురం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ను జిల్లా ఇన్చార్జి ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మార్కాపురం జిల్లాలో శాంతిభద్రతలు, పోలీస్‌శాఖ, పరిపాలన అధికార యంత్రాంగం మధ్య సమన్వయం, అలాగే జిల్లాకు సంబంధించిన పలు అంశాల పై చర్చించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి యు నాగరాజు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కమ్యూనిటీ హాల్లో 53వ వేద సభలు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 22)
జగద్గురువు ఆది శంకరాచార్యుల వారి జయంతి సందర్భంగా గత రెండు రోజులుగా రంగారాయుడు చెరువు వద్ద గల శుభప్రద కమ్యూనిటీ హాల్ నందు 53వ వేద సభలు నిర్వహించడం జరిగింది. దీనికి 100 మంది విద్యార్థులు హాజరుకాగా పరీక్షల నిర్వహించడానికి ప్రముఖ ఘనాపాటి అయిన బ్రహ్మశ్రీ వంగల కృష్ణమూర్తి, హరి శంకర్, చంద్రశేఖర్ నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని ప్రముఖ వేద పండితులు సదాశివ శాస్త్రి, మహంకాళి శేషయ్య, మైనంపాటి సాయి, మురళీకృష్ణ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఘనాపాటి వారికి సన్మానాలు వేదం అభ్యసించిన పిల్లలకి సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది. ముందు రోజు శంకరాచార్యుల వారి శోభాయాన యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కామరాజు గడ్డ కుసుమ కుమారి, ఆదిపూడి గిరిజ శంకర్, శాండిల్య, సాక్షి, సుజాత, మారుతి, వినయ్ కుమార్, సెనగవరపు సుబ్బయ్య, శ్రీనివాసశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

# సెన్సస్ 2027 పై శిక్షణ



(షణ్ముఖ వెలుగు, నూజెండ్ల, ఏప్రిల్ 22)
నూజెండ్ల మండలంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సెన్సస్ -2027 లో భాగంగా ఎన్యుమరేటర్లు మరియు సూపర్వైజర్ల మూడో బ్యాచ్ శిక్షణా తరగతులు నిర్వహించారు. మొదటి సెషన్ లోనే మాష్టర్ ట్రైనర్స్ బాలకృష్ణ, నాగేశ్వరరావులు స్వీయ గణన పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్న అందరిచే స్వీయ గణన పూర్తి చేయించారు. అందరూ కలిసి గ్రామంలో జనగణనపై అవగాహనా ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో జనగణన ప్రాధాన్యతను తెలుపుతూ నినాదాలు చేశారు. ముఖ్య అతిథులుగా మండల తహశీల్దార్ రమేష్, ఏఎస్ఓ నాగశ్రీనివాసరావు పాల్గొని జనగణనలో అందురూ పాల్గొనాలని, జనగణన మనందరి బాధ్యత అని అన్నారు. అనంతరం ఇండ్ల గణనలో అడగాల్సిన ముప్పై మూడు ప్రశ్నలపై ఫీల్డ్ ట్రైనర్ ఘంటా నాగేశ్వరరావు వివరణ ఇస్తూ అవగాహన కల్పించారు. శిక్షణలోని ఎన్యూమరేటర్లుగా పాల్గొన్న వారిచే రివిజన్ నిర్వహించారు. కార్యక్రమంలో అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం



్యంగా రాత్రి వేళల్లో, వర్షాకాలంలో వీటి ఉపయోగం చాలా ముఖ్యమన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం, వేగ పరిమితులను పాటించడం వంటి నియమాలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాదాలను పూర్తిగా నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, జిల్లా పోలీస్ శాఖ తీసుకుంటున్న ఈ చర్యలకు ప్రజల సహకారం కూడా అవసరమని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ, వేగ నియంత్రణ పాటించడం, మలుపులు వద్ద జాగ్రత్తగా వాహనాలు నడపడం, రోడ్డు పరిస్థితులను గమనించడం వంటి అంశాలను కచ్చితంగా అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం డిఎస్పీ యు నాగరాజు, వై పాలెం, కంభం, గిద్దలూరు రూరల్, గిద్దలూరు అర్బన్, త్రిపురాంతకం సిఐలు కె అజయ్ కుమార్, మల్లికార్జునరావు, రామకోటయ్య, సురేష్, అస్సన్, ఎస్ఐలు, నేషనల్ హై వే అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు








(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, ఏప్రిల్ 22)
రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా కొనకనమిట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామం సమీప నేషనల్ హైవే వద్ద ఉన్న ప్రమాదకర మలుపును జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు బుధవారం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మలుపు వద్ద వాహనదారులకు ముందస్తు హెచ్చరికలు అందేలా అక్కడ ఉన్న బారికేడ్ల పై రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేయించడంతో పాటు, ఎదురుగా వస్తున్న వాహనాల కదలికలను స్పష్టంగా గమనించేందుకు కుంభాకార దర్పణాలను ఏర్పాటు చేయించారు. రాత్రిళ్లు తక్కువ దృష్టి ఉన్న పరిస్థితుల్లో ప్రయాణించే వాహనదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, ప్రమాదాలకు కారణమవుతున్న మలుపులను గుర్తించి, వాటిని సురక్షితంగా మార్చేందుకు ఇలాంటి చర్యలు తీసుకోవడం అవసరమన్నారు. ముఖ్యంగా వాహనాల అధిక వేగం, హెచ్చరిక బోర్డులు, రాత్రి వేళల్లో తగిన వెలుతురు వంటి వాటిని ఏర్పాటుకు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రమాదాలకు కారణమయ్యే ప్రదేశాలలో ముందస్తు జాగ్రత్త చర్యలను చేపట్టాలని, రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని, రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. మైనర్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వంటి ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా ఎస్పీ వెంట ఎస్బి ఇన్స్పెక్టర్ కె శ్రీనివాసరావు, పొదిలి సిఐ రాజేష్ కుమార్, కొనకనమిట్ల ఎస్ఐ శ్రీకాంత్, నేషనల్ హైవే సంబంధించిన అధికారి అవినాష్, సిబ్బంది ఉన్నారు.

## ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత



ఆర్డీవో ప్రభాకర్, ఎస్సీ కమిషన్ సభ్యులు గౌతమ్ రాజు, రామాంజమ్మ, సోషల్ వెల్ఫేర్ డిడి లక్ష్మణ్ నాయక్, డీఎస్పీ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు భగీరథ జయంతి కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఏప్రిల్ 22)
మార్కాపురం పట్టణంలోని విద్యుత్ కార్యాలయం వద్ద గురువారం ఉదయం 10 గంటలకు భగీరథ జయంతి కార్యక్రమం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి నిర్మలా జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ విజయ సునీత, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని ఆమె తెలిపారు. అధిక సంఖ్యలో ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.



# పేదలకు అండగా సీఎం సహాయనిధి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 22)
అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం అండగా ఉంటుందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు అన్నారు. గడిచిన 20 నెలల కాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నియోజకవర్గంలో 19 కోట్ల 13 లక్షల 41 వేల 24 రూపాయలు సహాయం అందించడం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. ఒంగోలులోని దామచర్ల నివాసంలో బుధవారం 49 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 48 లక్షల 96 వేల 564 రూపాయల చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల వెంట నగర అధ్యక్షులు బండారు మదన్, తదితరులు పాల్గొన్నారు.





# ఎస్టీ సంఘాలతో సమావేశం తరువాతే ఎస్టీ కమిషన్ అధికారులతో సమీక్ష నిర్వహించాలి

## ఎస్టీ కమీషన్‌కు దళిత నేత నీలం నాగేంద్ర విజ్ఞప్తి


(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 22)

గురువారం జిల్లాకు విచ్చేయుచున్న ఎస్టీ కమిషన్, సభ్యుల బృందం ఎస్టీ సంఘాలతో సమస్యల పై చర్చించిన తర్వాతనే జిల్లా కలెక్టర్ ఎస్పీలతో అధికారిక సమీక్ష సమావేశం నిర్వహించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ఎస్టీ కమిషన్‌కు పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఎస్టీ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారుల పనితీరు పై ఎస్టీ కమిషన్ ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి జిల్లాకు రావడం హర్షనీయం అన్నారు. ఎస్సీ కమిషన్ చీమకుర్తి మండలం బండ్లమూడి మాదిగలపై జరిగిన దాడి ఘటనలో పరామర్శించి వెళ్ళింది తప్పితే జిల్లాలో అధికారిక సమీక్ష నిర్వహించలేదన్నారు. జిల్లాలో ప్రధానంగా ఎరుకుల యానాది కులాల ప్రజలకు పెన్షన్లు కూడా సక్రమంగా అందటం లేదన్నారు. ఎస్టీ కాలనీలలో రోడ్లు కూడా లేవు అన్నారు. ఎస్టీ కాలనీలకు మంచినీటి వసతి గృహ నిర్మాణం ఆరోగ్యం విద్య అందించవలసిన స్కూళ్ళు హాస్టల్లో ఏర్పాటుపై కమిషన్ దృష్టి సాధించాలన్నారు. అలాగే జిల్లాలోని ఎస్టీ పేరుతో నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించి అరెస్టు చేయించాలన్నారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే జిల్లా లెవెల్ స్క్రూటీని కమిటీలు కేవలం క్యాస్ట్ సర్టిఫికెట్లు మాత్రమే రద్దు చేస్తున్నారని దొంగ సర్టిఫికెట్ల దొరలు దర్జాగా కోర్టులకు వెళ్లి రిటైర్డ్ అయిందాక ఉద్యోగాలు చేస్తున్నారు అన్నారు. అలాగే యానాదులకు ఉపయోగపడే అటవీ హక్కుల చట్టం భూమి అభివృద్ధి పథకాలపై సమీక్షించి ఎస్టీలకు భూముల దక్కేల ఆదేశించాలన్నారు. అలాగే గిరిజనులు వ్యాధి బారిన పడకుండా ఆరోగ్యపరంగా వారికి మందులు అందించేలా వారి ఏరియాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నెలకొల్పాలన్నారు. అలాగే జిల్లాలో ఐటిడిఏ స్కీమ్స్ అమలులో అలసత్వం పై కూడా సమీక్షించి బ్యాంకుల నుండి ఎస్టీ మహిళలకు రుణాలు ఇవ్వ ఉద్యోగులకు ఉపయోగపడేని అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్టీ యువతకు ఉపయోగపడే బ్యాక్లాగ్ ఉద్యోగాల తొ పాటు ఉద్యోగులకు ఉపయోగపడే రూల్ ఆఫ్ రిజర్వేషన్ అన్ని శాఖల వారీగా సమీక్షించాలన్నారు. ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న దర్శి మండలం చింతలపాలెం గ్రామంలో 50 ఎకరాల ప్రభుత్వ భూమిని అగ్రకుల భూస్వాములు ఆక్రమించి సాగు చేసుకుంటే అభ్యంతరం పది ఎకరాలు సాగు చేసుకుంటున్న చింతలపాలెం కోటేశ్వరరావు తదితరులపై అక్రమ కేసులు పెట్టి భూమిలోకి రావద్దని కేవలం ఎస్టీల భూముల్లో బోర్డులు పెట్టటం. ఎస్టీ కులస్తులపై పోలీసు రెవెన్యూ అధికారుల చట్ట వ్యతిరేక చర్యలపై కూడా సమీక్షించి ఎస్టిలకు ఆ భూముల పై హక్కులు కల్పించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నేల నాగేంద్రరావు ఎస్టీ కమిషన్‌కు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు కోలా జీవరత్నం, మేడికొండ మురళి, దేవరపల్లి గోపి, పత్రా బంగారం, దారా అంజయ్య, కాకుమాను రవి, తదితరులు పాల్గొన్నారు.




## సింగరాయకొండ హైవే పై అంబులెన్స్‌కు ప్రమాదం






(షణ్ముఖ వెలుగు, కొండపి, ఏప్రిల్ 22)

సింగరాయకొండ సమీపంలోని జాతీయ రహదారిపై అంబులెన్స్ ప్రమాదం జరిగింది. చెన్నై నుంచి వైజాగ్ వెళ్తున్న అంబులెన్స్ బుధవారం తెల్లవారుజామున అదుపుతప్పి ఫెన్సింగ్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు రోగి, ఇద్దరు గార్డియన్లకు స్వల్ప గాయాలయ్యారు. వారిని హైవే అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్ కి తరలించారు. డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణమని ప్రాథమిక సమాచారం. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ముగిసిన జనగణన శిక్షణ కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఏప్రిల్ 22)

జనగణన 2027లో వివరాలు తప్పులు లేకుండా పారదర్శకంగా నమోదు చేయ్యాలని మండల తహశీల్దార్ జె.ప్రభాకరరావు ఎన్యూమరేటర్స్ సూపర్ వైజర్లకు సూచించారు. బుధవారం మండలంలోని చిన్నగంజాం జేడ్పి హైస్కూలు నందు ఎన్యూమరేటర్స్, సూపర్ వైజర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతి ముగుంపు సందర్భంగా తహశీల్దార్ జె ప్రభాకరరావు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి తప్పులు లేకుండా కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె ప్రభాకరరావు, ఎఎస్ఓ శివ ప్రసాద్, ట్రైనింగ్ అధికారులు ఎన్ శ్రీనివాసరెడ్డి, రామాంజనేయులు, ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వేములూరు పంచాయతీ అధ్యక్షులు పల్లెం యల్లారెడ్డి



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఏప్రిల్ 22)

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ఆయన పులివెందుల పర్యటనలో భాగంగా అట్లూరు మండలం, వేములూరు పంచాయతీ అధ్యక్షులు పల్లెం యల్లారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పులివెందుల క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో యల్లారెడ్డి జగన్మోహన్‌రెడ్డికి సాదర స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు, అనంతరం పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వేములూరు పంచాయతీ అభివృద్ధికి పల్లెం యల్లారెడ్డి అందిస్తున్న సేవలను వైఎస్ జగన్ అడిగి తెలుసుకున్నారు. పార్టీ పట్ల ఆయన చూపిస్తున్న నిబద్ధతను, నిరంతరం ప్రజల చెంత ఉంటూ చేస్తున్న సేవా కార్యక్రమాలను జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో ప్రజల కోసం పనిచేయాలని ఆయనకు సూచించారు. పంచాయతీ పరిధిలోని ప్రజా సమస్యలు, కొనసాగుతున్న అభివృద్ధి పనులపై ఎల్లారెడ్డి వివరణ ఇచ్చారు. కార్యకర్తలకు, నాయకులకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని, ప్రజల కోసం పోరాటం కొనసాగిద్దామని జగన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పల్లెం ఎల్లారెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తమ అభిమాన నాయకుడు జగన్మోహన్‌రెడ్డిని కలవడం పట్ల యల్లారెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ, ఆయన చూపిన అభిమానం తనపై బాధ్యతను మరింత పెంచిందని పేర్కొన్నారు.

## మంచినీటి ట్యాంకును ప్రారంభించిన ఎమ్మెల్యే బి ఎన్ విజయ్‌కుమార్

(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, ఏప్రిల్ 22)

మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో రూ. 2.50 లక్షలతో పునఃనిర్మాణం చేసిన మంచినీటి ట్యాంక్‌ను సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, మద్దిపాడు మండల అధ్యక్షులు ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మదనపల్లి శ్రీనివాసరావు, అడక స్వాములు, పోతినేని శ్రీనివాసరావు (పి యస్ఆర్), మండలం అధికారులు, మండల నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







## ముప్పాళ్ళ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ పై అవగాహన





(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 22)

మండలంలోని ముప్పాళ్ళ అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రిజ్వాన ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ బి సుశీల మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం వలన మానసిక ఎదుగుదలతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. పిల్లల్లో చురుకుదనం పెరుగుతుంది. చిన్నారులకు తల్లిపాలతో పాటు పోషక ఆహారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలోసూపర్వైజర్ శ్రీనివాసరావు, ఏఎన్ఎం నిర్మల, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు, టి పద్మావతి, ఏ గోవర్ధనమ్మ, ఏ పద్మ, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

## కే అగ్రహారంలో చలివేంద్రం





(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 22)

మండలంలోని కె అగ్రహారం గ్రామం సెంటర్‌లో పొన్నలూరు వ్యవసాయశాఖ ఎరువుల డీలర్ పద్మావతి, యాజమాన్యం ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దగ్గర వేసవి చలివేంద్రం సెంటర్‌ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా విచ్చేసిన మండల వ్యవసాయధికారి వి రాము మాట్లాడుతూ వేసవికాలంలో ఎల్ నీనో ప్రభావం వలన ఎండ తీవ్రత ఎక్కకువగా జులై వరకు ఉంటుందన్నారు. రైతులు, ప్రజలు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు అత్యవసర పరిస్థితులలో తప్ప బయటకు రాకూడదని, కుండ నీటిని త్రాగాలని, డీ హై డ్రరేషన్ బారిన పడకుండా నిమ్మరసం, మజ్జిగ ఎక్కువ తీసుకోవాలని తెలియజేసారు. అలాగే రోజుకి 5-6 లీటర్లు నీరు త్రాగాలని తెలిపారు. ఈ కార్యక్రంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ కృష్ణయ్య, మండలం ఎరువుల డీలర్లు, గ్రామ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రాంబాబు కుటుంబాన్ని పరామర్శించిన వైయస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కేశవరపు జాలిరెడ్డి





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 22)

ఇటీవల అనారోగ్య కారణంగా మరణించిన కరేడు గ్రామ టైలర్ రాంబాబు కుటుంబ సభ్యులను బుధవారం వైయస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కేశవరపు జాలిరెడ్డి పరామర్శించారు. రాంబాబు ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేయడం జరిగింది. రాంబాబు కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేస్తూ భవిష్యత్తులో కూడా అండగా ఉంటామని ధైర్యం చెప్పడం జరిగింది. కలిసిన వారిలో వైయస్సార్ గ్రామ నాయకులు నలపరెడ్డి సుధాకర్‌రెడ్డి, పీతా రామకృష్ణ, ఏడుకొండలు, దారా శ్రీను, నరసింహ, సంగీత రావు, నాగరాజు, దారా శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

# నాగులుప్పలపాడు పరిధిలో పేకాటి శిబిరం పై దాడి ఆరుగురు అరెస్ట్



(షణ్ముఖ వెలుగు, నాగులుప్పలపాడు, ఏప్రిల్ 22)
ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు నాగులుప్పలపాడు మండల పరిధిలోని వినోదరాయుడుపాలెం గ్రామ సమీపంలో పేకాట శిబిరంపై పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి నగదు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సుధాకర్ పర్యవేక్షణలో ఎస్ఐ సుదర్శన్, ఏఎస్ఐ మహబూబ్‌బాషా, పోలీస్ సిబ్బంది ఈ దాడిలో పాల్గొన్నారు. వినోదరాయుడుపాలెం పొలాల్లో కోత ముక్క, పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో పోలీసులు ఈ దాడులు నిర్వహించారు. ఈ దాడిలో రూ.10,020 నగదు, 6 స్మార్ట్ ఫోన్లతో పాటు సంఘటనా స్థలంలో పేకాట ఆడుతున్న 6 గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు సాగినా సహించేది లేదని, నిబంధనలు అతిక్రమిస్తే చట్ట పరమైనచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టుబడిన వారిని నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

# ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సత్కారం





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 22)
ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన స్థానిక శ్రీ ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన ఘనంగా సత్కరించారు. కళాశాలకు చెందిన విద్యార్థిని, చుండూరి ప్రసాద్ కుమార్తె లోకేశ్వరి ధృతి సిఈసీ విభాగంలో 500 మార్కులకు గానూ 493 (493/500) మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ కైవసం చేసుకోగా, ఎంపీసీ విభాగంలో జంపు మంజుల 470కి 463 (463/470) మార్కులు సాధించి టౌన్ ఫస్ట్ ర్యాంక్ తో సత్తా చాటారు. ఈ సందర్భంగా ఆ ఇద్దరు విద్యార్థులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శాలువాతో సత్కరించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి కన్న తల్లిదండ్రులతో పాటు, సొంత ఊరికి ఎంతో మంచి పేరు తీసుకురావడం గర్వకారణమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా వారు ఉన్నత చదువులు అభ్యసించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ధరిత్రి దినోత్సవ కార్యక్రమం




(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 22)
మండల కేంద్రమైన ఉలవపాడు జీవి ఎస్ఎమ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రోజున ప్రపంచ ధరిత్రి దినోత్సవం ఇకో క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ డి సుజాత, జి కిషోర్, డాక్టర్ సిహెచ్ మాణిక్యరావు, బి తేజస్వి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇకో క్లబ్ కోఆర్డినేటర్ మాట్లాడుతూ ప్రపంచ ధరిత్రి దినోత్సవం ప్రతి సంవత్సరం ఏప్రిల్ 22 న జరుపుకుంటారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, భూమిని రక్షించడంపై అవగాహన పెంచడం దీని ముఖ్య ఉద్దేశం. 1970లో ప్రారంభమైన ఈ దినోత్సవం ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, మొక్కలు నాటడం వంటి చర్యల ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవాలని పిలుపునిస్తుంది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఐన్యూస్ రిపోర్టర్ పాలూరిను పరామర్శించిన అన్నా రాంబాబు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఏప్రిల్ 22)
జర్నలిస్టులు సమాజానికి కీలకమైన సేవలు అందిస్తున్నారని, వారి సంక్షేమం పట్ల ఎల్లప్పుడూ తమ మద్దతు ఉంటుందని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు పేర్కొన్నారు. మార్కాపురం జిల్లా, పెద్దారవీడు మండలం, ఎస్.కొత్తపల్లి గ్రామానికి చెందిన ఐ న్యూస్ రిపోర్టర్ పాలూరి శ్రీనివాసరావు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. వైద్యుల పర్యవేక్షణలో కొంతకాలం చికిత్స పొందిన అనంతరం ప్రస్తుతం ఆయన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు, స్వయంగా శ్రీనివాసరావు నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, జరిగిన ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. త్వరగా కోలుకొని మళ్లీ తన వృత్తిలో చురుకుగా కొనసాగాలని ఆకాంక్షించారు. అలాగే కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. అవసరమైన వైద్య సహాయం లేదా ఇతర సహకారం ఏదైనా కావాలంటే పార్టీ తరఫున ఎప్పుడైనా అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఎస్.కొత్తపల్లి మాజీ సర్పంచ్ దండ రామకృష్ణ రెడ్డి, గనివానిపాడు సర్పంచ్ పాలూరి వెంకటేశ్వర్లు, దండ గాలిరెడ్డి, ఏరువా రమణారెడ్డి, దండా వెంకట నారాయణరెడ్డి, ముప్వ గాలయ్య, ఆరవేటి వెంకటేశ్వర్లు, ఆరవేటి అల్లూరయ్య, తదితరులు పాల్గొని శ్రీనివాసరావుని పరామర్శించి, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# ఘనంగా మోడల్ ఈఏపీసెట్-2026 పోస్టర్ ఆవిష్కరణ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 22)
రైట్స్ ఫర్ యూత్ అండ్ స్టూడెంట్స్ ఫోరం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న "మోడల్ ఈఏపీసెట్" గోడ పత్రికను (పోస్టర్) బుధవారం ఆర్ఐవో, డీఈవో లు ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వైఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చామల లక్ష్మారెడ్డి, జిల్లా అధ్యక్షులు రాజ్ విశాల్, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ఐవో, డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించడంలో ఈఏపీసెట్ వంటి ప్రవేశ పరీక్షలు కీలకమని, అటువంటి పరీక్షలకు విద్యార్థులు మానసికంగా సిద్ధపడాలని సూచించారు. "చాలామంది విద్యార్థులు ప్రతిభ ఉన్నప్పటికీ, పరీక్షా కేంద్రంలో ఉండే ఒత్తిడి వల్ల తడబడతారు. ఈ మోడల్ టెస్ట్ విద్యార్థులలో ఆ భయాన్ని పోగొట్టి, ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. అసలు పరీక్షకు ముందే సెల్ఫ్-అసెస్మెంట్ (స్వీయ విశ్లేషణ) చేసుకోవడానికి ఇది ఒక అద్భుతమైన అవకాశం" అని వారు కొనియాడారు. ఈ పరీక్ష రాయడం వల్ల కలిగే లాభాలను ఆర్‌వైఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చామల లక్ష్మారెడ్డి వివరిస్తూ విద్యార్థులు సమయ పాలన నేర్చుకోవడానికి, ప్రశ్నల సరళిని అర్థం చేసుకోవడానికి ఈ మోడల్ టెస్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఏప్రిల్ 28, 2026 నుండి ఏప్రిల్ 30, 2026 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన మొదటి 10 మంది విద్యార్థులకు ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులు అందజేయబడతాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఒక సవాలుగా తీసుకుని, తమ ప్రతిభను చాటుకోవాలని ఆర్‌వైఎస్ఎఫ్ ప్రతినిధులు కోరారు. పూర్తి వివరాలకు 8977556057, 7997514648 నంబర్లను సంప్రదించాలన్నారు.

# ప్రైవేట్ హాస్పటల్‌కు ధీటుగా ములకలూరు ఆయుష్ వైద్యశాల డాక్టర్ మహాదేవ్

(షణ్ముఖ వెలుగు, నూజండ్ల, ఏప్రిల్ 22)








మండలంలోని ములకలూరు గ్రామంలో ఆయుర్వేద వైద్యశాల ప్రైవేట్ హాస్పిటల్ కి దీటుగా ఓపి వస్తుందని వైద్యాధికారి మహదేవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం తలార్లపల్లి పంచాయతీ రెడ్డిపాలెం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ఎక్కువగా మంచినీరు తీసుకోవాలని, ఎండలో ప్రయాణించేటప్పుడు తలకు టోపీ, తలపాగా, గొడుగును వాడాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం అయిన వారికి ఉచితంగా మందులు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది గంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# నమ్మకమైన స్నేహితుడు జాన్ సామ్యూల్ రాష్ట్ర ఎస్సీ కమీషన్ చైర్మన్ జవహర్



(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, ఏప్రిల్ 22)
తనకు నమ్మకమైన స్నేహితుడు జాన్ సామ్యూల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమీషన్ చైర్మన్ జవహర్ అన్నారు. త్రిపురాంతకం మండలంలోని స్థానిక జిల్లాపరిషత్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న జాన్ సామ్యూల్ పదవి విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎస్సీ కమీషన్ చైర్మన్ జవహర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిషత్ మొత్తం ఉపాధ్యాయుల పై ఆధారపడి ఉంటుంది అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబుద్ధులు సరైన పద్ధతులలో నేర్పించాలని సూచించారు. పదవీవిరణ పొందుతున్న జాన్ సామ్యూల్ ఇప్పటి నుండి సమాజ సేవకై తమ విశ్రాంత జీవితం సాగించి మంచిపేరు సాధించాలని అన్నారు. దళిత గిరిజన వాడలో వుంటున్న బడుగు బలహీన వర్గాలకు మేలైన విద్యను అందించి వారి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఎస్సీ కమీషన్ మెంబెర్స్ గౌతం, దాసు, రామాంజనమ్మ, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ పాఠశాల అన్ని విధాలుగా అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. సమస్యలను తెలిపిన వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళే వేగంగా పరిష్కార మార్గం చూపుతామన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం మాట్లాడే వ్యక్తి ఉపాధ్యాయుడు జాన్ సామ్యూల్ అన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘంలో కీలక పదవులు చేపట్టి వారి సమస్యలు పరిష్కరించడంలో ముందు ఉన్నారన్నారు. తాను పదవి విరమణ పొందినా రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం ఆయన నాయకులు, ఉపాధ్యాయులు, ప్రజా సంఘ నాయకులు శాలువా పులామలతో సత్కరించి జాన్ సామ్యూల్ దంపతులను శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ తులసి మల్లికార్జున నాయక్, రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, మండల నాయకులు, మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ మేకల వలరాజు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# నేరాల కట్టడికి ప్రతి ఒక్క పోలీసు అధికారి కృషి చేయాలి



**పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించి,
బాధితులకు న్యాయం అందేవిధంగా చూడాలి
రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్, మైనర్ డ్రైవింగ్ లపై ప్రత్యేక దృష్టి సారించాలి
గంజాయి వంటి మాదక ద్రవ్యాల అనర్థాల పై, సైబర్ నేరాలు,
రోడ్డు భద్రతల పై ప్రజల్లో విరివిగా అవగాహన కల్పించాలి
ఎన్ఫోర్స్మెంట్‌ను పెంచి చట్టవ్యతిరేక,
అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయాలి
మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 22)**

జిల్లాలో నేరాల నియంత్రణపై ప్రత్యేక కార్యచరణతో ప్రణాళికా బద్ధమైన చర్యలు తీసుకుంటూ, ప్రతి ఒక్క పోలీస్ అధికారి సమన్వయంతో పనిచేసి జిల్లాలో ప్రశాంతమైన వాతావరణాన్ని నెలకొల్పేలా కృషి చేయాలని మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు అన్నారు. జిల్లా డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలతో బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ గారు ముఖ్యంగా అపరిష్కృతంగా ఉన్న కేసులలో సమగ్ర దర్యాప్తు చేసి, మహిళా సంబంధిత నేరాల్లో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట సమయం లోపల బాధితులకు న్యాయం అందించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. మహిళలకు సంబంధించిన ఏ విషయమైనా సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. లా అండ్ ఆర్డర్ ను పరిరక్షించే విషయంలో అందరూ అధికారులు అప్రమత్తంగా ఉండాలి. నాన్‌బెయిలబుల్ వారెంట్లు ఉన్న వ్యక్తులను తక్షణమే అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచాలని సూచించారు. ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరగా పట్టుకుని ప్రాపర్టీ రికవరీ శాతాన్ని పెంచాలని, దొంగతనాలు, దోపిడీల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్, నైట్ బీట్స్ బలోపేతం చేసి క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. పిల్లలకు వేసవి సెలవుల సందర్భంగా మైనర్ డ్రైవింగ్‌ను అరికట్టుతూ, ఈత రాని వారు చెరువులు, కుంటలు, వాగుల్లోకి దిగకుండా తల్లిదండ్రులు, ప్రజలు తగిన అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడం ప్రధాన




లక్ష్యంగా సంబంధిత శాఖలను సమన్వయం చేసుకుని తగు చర్యలు తీసుకోవాలని, మలుపులు, జంక్షన్లు, టి జంక్షన్, వై జంక్షన్, యు టర్న్, విజిబిలిటీ తక్కువగా ఉన్న ప్రదేశాలను గుర్తించిన ప్రాంతాల్లో అదనంగా హెచ్చరిక బోర్డులు,కుంభాకార దర్పణాలు, ప్రతిబింబించే స్ట్రిప్స్, వేగ పరిమితి సూచనలు ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్య ప్రాంతాలలో పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్ ద్వారా వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలపై ఇంకా విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో చెడునడతగల వ్యక్తులు, పాతముద్దాయిలపై నిఘా పెట్టాలని, ప్రతి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎన్ఫోర్స్మెంట్ పెంచాలని, పేకాట ,మట్కా గంజాయి, కోడి పందాలు పూర్తిగా అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని, అసాంఘిక,చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. గ్రామ సందర్శనలు చేసి ఎక్కడైనా గ్రామాలలో గొడవలు సృష్టించే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. సైబర్ నేరాలు, గంజాయి వంటి మాదక ద్రవ్యాల అనర్థాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, కొత్త చట్టాలు, శిక్షలు, బాల్య వివాహాలు, గుడ్ టచ్-బ్యాడ్ టచ్ తదితర అంశాల పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. కెమెరాల యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు తెలియచేసి ఏర్పాటు చేసే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం డిఎస్పీ యు నాగరాజు, ఎస్బి ఇన్స్పెక్టర్ కె శ్రీనివాసరావు, వైపాలెం, కంభం, గిద్దలూరు రూరల్, గిద్దలూరు అర్బన్, త్రిపురాంతకం సీఐలు కె అజయ్ కుమార్, మల్లికార్జునరావు, రామకోటయ్య, కె సురేష్, అస్సన్, ఎస్ఐలు పాల్గొన్నారు.


## ప్రధాని పై వ్యాఖ్యలు ఖండించిన బద్వేల్ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ సుప్రజ

**(షణ్ముఖ వెలుగు, గోపవరం, ఏప్రిల్ 22)**



బద్వేల్ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ సుప్రజ, ప్రధాని నరేంద్ర మోదీ పై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను ఖండించారు. విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆమె, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధానిని అవమానకరంగా విమర్శించడం తగదన్నారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా తీసుకున్న కీలక నిర్ణయాలతో ప్రధాని మోదీ ప్రజల మన్ననలు పొందారని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు సంస్కారంతో వ్యవహరించి, హుందాతనంతో విమర్శలు చేయాలని సూచించారు. అలాగే మల్లికార్జున ఖర్గే పేరుతో ఈ వ్యాఖ్యలు వెలువడటం తగదని పేర్కొంటూ, దేశ ప్రజలు ఈ పరిణామాలను గమనిస్తున్నారని ఆమె అన్నారు.

## బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడికి సన్మానం



**(షణ్ముఖ వెలుగు, గోపవరం, ఏప్రిల్ 22)**

బద్వేలు సీమాంక్ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా నియమితులైన డాక్టర్ క్రాంతి కుమార్‌ను పట్టణ అభివృద్ధి సొసైటీ, ఆవాజ్ కమిటీ, మహనీయుల ఆశయాల సాధన సమితి సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దుశ్శాలువా, పూలమాలతో ఆయనను అభినందించారు. పట్టణ అభివృద్ధి సొసైటీ అధ్యక్షుడు నానబాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, పరికరాలు, మందులు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకుని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. డాక్టర్ క్రాంతి కుమార్ స్పందిస్తూ, ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తార్, రసూల్, గురుమూర్తి, రాధాకృష్ణ, నారాయణ రెడ్డి, సుబ్బారావు, వెంకట రాజేష్ కుమార్, తోట రాము, తదితరులు పాల్గొన్నారు.

## 8వ పోషణ పక్వాడా వేడుకలు





**(షణ్ముఖ వెలుగు, పామూరు, ఏప్రిల్ 22)**

మండలంలోని వగ్గం పల్లి ప్రాథమిక పాఠశాల నందు 8వ పోషణ పక్వాడా-2026 పక్షోత్సవాల వేడుకలు ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎంవిఎస్ పార్వతి అధ్యక్షతన జరిగాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టాటా ట్రస్టు కార్యక్రమ నిర్వాహకులు డి గోపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్వతి మాట్లాడుతూ గర్భధారణ సమయము నుండి 2సం. లకు బిడ్డ మెదడు 80% అభివృద్ధి చెందుతుందని ,తల్లి తీసుకునే పోషకాహారం మీద తల్లి బిడ్డ ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని, జంక్ ఫుడ్ కు దూరంగా ఉండి స్థానికంగా లభ్యమయ్యే ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని, 3వ సంవత్సరం రాగానే పిల్లలను పూర్వ ప్రాథమిక విద్య కొరకు అంగన్వాడి స్కూలుకు పంపాలని, అక్కడ ఆటపాటలు, కృత్యాల ద్వారా పునాది విద్యను అందిస్తారని ఇది వారి శారీరక ,మానసిక, సామాజిక, భావోద్వేగ సమగ్ర వికాసానికి దోహదపడుతుందని ప్రారంభవిద్య-ఎదుగుదలను గూర్చి అవగాహన కలిగించిరి. గోపి మాట్లాడుతూ సెల్ ఫోన్, టీవీలకు పిల్లలను దూరంగా ఉండేలా చూడాలని, ఆటలు, పాటలు, కథల ద్వారా తల్లిదండ్రులు, తాత, అమ్మమ్మలు పిల్లలతో కొంత సమయం గడపడం ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. 3-6 సం. పిల్లలందరినీ అంగన్వాడీ కి పంపుతామని, జంక్ ఫుడ్ వద్దు-సాంప్రదాయ ఆహారం ముద్దు అని ప్రతిజ్ఞ చేశారు. తదుపరి గ్రామంలో పోషణ పక్వాడ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి కోటేశ్వరరావు, అంగన్వాడీ కార్యకర్తలు ఫణి కుమారి, ఈశ్వరమ్మ, సువార్తమ్మ, రామాంజమ్మ, మరియమ్మ, లక్ష్మీ, కళ్యాణి, దేవిశ్రీ, హెల్పర్ నారాయణమ్మ, గర్భవతులు, బాలింతలు, మహిళలు, తండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

## శ్రీహరికోటను సందర్శించిన టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

### ఉత్సాహంగా సాగిన షార్ విజ్ఞాన యాత్ర



**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 22)**

స్థానిక టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) విద్యార్థులు తిరుపతి జిల్లా, శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌ను సందర్శించారు. విజ్ఞాన యాత్రలో భాగంగా చేపట్టిన ఈ పర్యటన విద్యార్థులకు అద్భుతమైన అనుభూతిని అందించడమే కాకుండా, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సాధించిన విజయాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించింది. ముఖ్యంగా విద్యార్థులు మిషన్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించి, రాకెట్ ప్రయోగ సమయంలో శాస్త్రవేత్తలు అనుసరించే వ్యూహాలు, ప్రయోగాన్ని నియంత్రించే తీరును గమనించారు. అందులోని రాకెట్ ప్రయోగ నమూనాలను చూసి సాంకేతికతపై తమ అవగాహనను పెంచుకున్నారు. అనంతరం వాతావరణ పరిశోధనల కోసం ఉపయోగించే సౌండింగ్ రాకెట్ ఫెసిలిటీని సందర్శించి, వాటి తయారీ, ప్రయోగ పద్ధతుల గురించి అడిగి తెలుసుకున్నారు. భారతదేశ కీర్తి కిరీటాలైన రాకెట్లను ప్రయోగించే మొదటి లాంచ్ ప్యాడ్, రెండవ లాంచ్ ప్యాడ్ ప్రదేశాలను సందర్శించినప్పుడు, భారీ రాకెట్లను లాంచ్ ప్యాడ్ వద్దకు తరలించే విధానం విద్యార్థులను ఎంతో అబ్బురపరిచింది. దేశాభివృద్ధిలో అంతరిక్ష పరిజ్ఞానం పాత్ర, దేశ భద్రత, సమాచార వ్యవస్థలో ఇస్రో ప్రాముఖ్యతను విద్యార్థులు ఈ సందర్భంగా నేర్చుకున్నారు. ప్రత్యక్ష అనుభవం ద్వారా నేర్చుకోవడం వల్ల ఈ విషయాలు విద్యార్థుల మనసుల్లో గొప్ప ముద్ర వేస్తాయని అధ్యాపకులు అభిప్రాయపడ్డారు. ఈ విజ్ఞాన యాత్రలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎడుకొండలు నరేంద్ర, ఐక్యుఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి రాజ గోపాల బాబు పాల్గొని విద్యార్థులకు తగిన దిశానిర్దేశం చేశారు. ఈ యాత్రను సమన్వయకర్త డాక్టర్ సుజాత విజయవంతంగా నిర్వహించారు. వీరితో పాటు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నరేష్, రాజా, డాక్టర్ పద్మావతి విద్యార్థులకు తోడుగా ఉండి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. శ్రీహరికోట వంటి ప్రతిష్టాత్మక కేంద్రాన్ని సందర్శించే అవకాశం కల్పించినందుకు విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్ మరియు యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ పర్యటన తమ భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యార్థులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.

## మైనర్లు డ్రైవింగ్ చేస్తే జైలుకే మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు కూడా బాధ్యులే

### మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరిత్యా నేరం
### పొదిలి సిఐ రాజేష్ కుమార్ హెచ్చరిక

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 22)**

మైనర్లకు వాహనాలు ఇచ్చిన, వాహనాలు నడిపిన కఠిన చర్యలు ఉంటాయని పొదిలి సిఐ రాజేష్ కుమార్ హెచ్చరించారు. వేసవి సెలవుల్లో సరదాకొసం మైనర్లకు వాహనం ఇవ్వడం వంటి కార్యక్రమాలు చేపట్టవద్దని తల్లిదండ్రులకు సూచించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహన యజమానులు, తల్లిదండ్రుల పై చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని, హెల్మెట్ తప్పనిసరిగా ఉపయెగించాలన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మైనర్లకు ఎట్టి పరిస్థితులలో వాహనాలు ఇవ్వారాదని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు.




## పాఠశాలకు బీరువా వితరణ





**(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఏప్రిల్ 22)**

మండలంలోని అన్నంభట్ల వారి పాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దేవరపల్లికి చెందిన తోకల తరుణ్ పుట్టినరోజు సందర్భంగా పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో తరుణ్ సౌమ్యల దంపతుల ఆర్థిక సహాయ సహాకారంతో పాఠశాలకు ఉపకరించే బీరువాను క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ పర్యవేక్షణలో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు తోకల కృష్ణ మోహన్ మాట్లాడుతూ పాఠశాలకు అవసరమైన వస్తువులను భవిష్యత్తులో రోటరీ క్లబ్ ద్వారా సమకూర్చాటనికి కృషి చేయ్యనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కోమటి ఆంజనేయులు, అసిస్టెంట్ గవర్నర్ నాగభైరు శ్రీనివాసరావు ,హెచ్ఎం భారతి, కొల్లా శివ నాగేశ్వరరావు, పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు గోరంట్ల భాస్కరరావు, దొడ్డ వెంకటరావు, గోరంట్ల శివకుమారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జూనియర్ ఇంటర్ ఫలితాలలో శ్రీ సాయి పూర్వ విద్యార్థుల ప్రభంజనం

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 22)**

మండల కేంద్రమైన ఉలవపాడు శ్రీ సాయి హై స్కూల్లో ఎస్ఎస్‌సీ -2025 పూర్తి చేసిన విద్యార్థులు జూనియర్ ఎంపీసీలో మానం మనోజ్ఞ(బద్దిపూడి) 467/470, కస్తాల త్రిజ్వల (మన్నేటికోట) 465/470, రేగలగడ్డ ప్రతీక (కరేడు) 464/470, కొచ్చర్ల మన్మధ (ఆత్మకూరు) 464/470 సాధించారు. మానం మనోజ్ఞ (బద్దిపూడి) 470 కి 467 సాధించి స్టేట్ 2వ ర్యాంకు, నెల్లూరు జిల్లా 1వ ర్యాంకు సాధించడం జరిగిందన్నారు. మంచి ర్యాంకులు మార్కులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను శ్రీ సాయి విద్యాసంస్థలు సన్మానించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కె వి శేషమ్మ మాట్లాడుతూ కార్పొరేట్ స్కూల్స్ కి ధీటుగా మన విద్యార్థులు స్టేట్ ర్యాంకులు, అత్యుత్తమ మార్కులు సాధించడం చాలా



గర్వకారణం అన్నారు. విద్యాపరంగా ఉలవపాడు మండలం గురించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం చెప్పుకోవడం చాలా ఆనందకరమైన విషయం అన్నారు. విద్యార్థులు ఇలాగే చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ శ్రీ సాయి స్కూల్ క్రమశిక్షణకు మారు పేరు అని విద్యార్థుల ఉన్నతిలో శ్రీ సాయి తన వంతు పాత్ర ఎప్పుడు పోషిస్తుందని సమాజంలో తమ పిల్లలు ఉన్నతంగా నిలవడానికి సహాయం అందిస్తుందని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ మోనిక ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.







# వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం తనిఖీ







**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 22)**

కందుకూరు డివిజనల్ డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఊర్మిళాదేవి బుధవారం కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఉలవపాడు, కరేడులో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల సరళిని ఆకస్మికంగా పరిశీలించడం జరిగింది. వేసవికాలంలో పిల్లలకు ఉదయం 8 గంటల నుండి 11 గంటల లోపు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ముగించాలని ఎండాకాలంలో గర్భిణులు, బాలింతలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలందరూ కూడా వడదెబ్బకి గురికాకుండా ఉండాలన్నారు. ఎక్కువ ఎండలో తిరగవద్దని మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని తెలియపరచడం జరిగింది. వ్యాధి నిరోధక టీకాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించడం జరిగినది అలాగే హెచ్‌పీవీ వ్యాక్సిన్ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా నిరోధించడానికి వేసే వ్యాక్సిన్ 14 సంవత్సరాల పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వ్యాక్సిన్ అందరూ పిల్లలు వేయించుకునే విధంగా చూడాలని వివరించారు. అలాగే కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి రికార్డులు పరిశీలించారు. వ్యాక్సినేషన్ ల్యాబ్, ఓపి విభాగాలను పరిశీలించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కావాల్సిన వసతుల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుప్రజారెడ్డి, పీహెచ్‌ఎన్ సీతరాములు, హెచ్‌వీ వసంత, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న, శనగ, పొగాకు రైతులను ఆదుకోవాలి



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 22)**

ప్రకాశం జిల్లాలో రైతులు పండించిన మొక్కజొన్న, శనగ, పొగాకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని బుధవారం ఒంగోలు జిల్లా కలెక్టర్ రాజా బాబుకి దర్శి ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాలనలో పొగాకు క్వింటా 32 వేల రూపాయలు అమ్ముడు పోయింది అని బర్లీ పొగాకు కూడా మంచి ధర ఉంది అన్నారు. గత సంవత్సరం ఈ సంవత్సరం పొగాకును ప్రభుత్వం పట్టించుకునే నాధుడు లేడన్నారు. పొగాకు సమస్యలను జగన్మోహన్‌రెడ్డి దృష్టికి మేము తీసుకెళ్లిన తరువాత పొగాకు మద్దతు ధర కల్పించారని, జగన్మోహన్‌రెడ్డి ఆందోళన చేసిన తరువాత నల్ల బార్లీని తూతూ మంత్రంగా కొనుగోలు చేశారన్నారు. ఈ సంవత్సరం బ్యార్ని పొగాకు గాని, తెల్ల బర్లీ చాలా మంది వేసుకున్నారు. ప్రభుత్వం నుండి కొనుగోలుకు రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. జగన్మోహన్‌రెడ్డి కాలంలో మూడు వేల కోట్లతో ధరల స్థిరీకరణ ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవడం జరిగిందన్నారు. ఈ ప్రభుత్వంలో అసలు రైతులను పట్టించుకునే నాధుడే లేడన్నారు. చంద్రబాబు నాయుడు వారి కూటమి ప్రభుత్వం ప్రకాశం జిల్లా రైతులను ఆదుకోవాలని మొక్కజొన్నకు మద్ధతు ధర కల్పించాలని, పొగాకు కున కూడా ప్రభుత్వం మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని కోరారు. మొక్కజొన్న, శనగను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు ఇంచార్జ్ చుండూరు రవిబాబు, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మారెళ్ళ బంగారు బాబు, రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు మారేడు సుబ్బారెడ్డి, నాగులుప్పలపాడు మండల పార్టీ అధ్యక్షులు శ్రీమన్నారాయణ, జిల్లా అధ్యక్షులు నగిరి కంటి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.







# నల్లూరి కోటయ్య, లింగంశెట్టి జాలయ్య పెద్దకర్మ

## కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 22)**

మద్దిపాడు మండలం పెద కొత్తపల్లి గ్రామంలో నల్లూరి కోటయ్య, ఇనమనమెల్లూరు గ్రామంలో లింగంశెట్టి జాలయ్య పెద్దకర్మ కార్యక్రమంలో సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బిఎన్ విజయ్‌కుమార్ పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మండల సెక్రటరీ మందపల్లి శ్రీనివాసరావు, పోతినేని శ్రీనివాసరావు (పియస్ఆర్), నల్లూరి శ్రీనివాసరావు, పుట్టా బ్రహ్మయ్య, గట్టినేని అయన్న, ప్రభాకర్‌రెడ్డి, గడ్డం రవి, తదితరులు పాల్గొన్నారు.



# 25న బ్రహ్మేంద్ర స్వామి మాలదారుణ స్వాములకు ఇరుముడి కార్యక్రమం

**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఏప్రిల్ 22)**

మండలంలోని రాజుబంగారుపాలెం పంచాయతీ కుక్కలవారిపాలెం గ్రామంలో వెంచేసిన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి అలయం శ్రీ సీతారాములయం వద్ద 25 ఏప్రిల్ శనివారం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మాలదారుణ చేసిన స్వాములకు ఇరుముడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు అలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఇరుముడి కార్యక్రమం సందర్భంగా పలు సంస్కృతిక కార్యక్రమలు నిర్వహించనున్నట్లు కె.సుబ్బారెడ్డి, అదినారయణ తెలిపారు. కార్యక్రమం అనంతరం ఉచిత అన్న ప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్ని విజయవంతం చేయ్యలని వారు కోరారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com